డ్రైనేజీతో..తప్పని తిప్పలు

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందించని అధికారులు

- హిమాయత్‌నగర్ వై జంక్షన్‌లో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహనదారులు

హిమాయత్‌నగర్ వైజంక్షన్ సమీపంలో రహదారిలో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ నీరు

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి 27: అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ వల్ల రోడ్లపై మురుగు నీరు ఏరులై పారుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు మాసాలకు పైగా హిమాయత్‌నగర్ వై జంక్షన్ సమీపంలో మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు పొంగి రోడ్డుపై ప్రహిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నారాయణగూడ జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకునే నాథుడే లేడు. ఈ సమస్యను జలమండలి అధికారులు పట్టించుకోకుండా అలసత్వం వహించడంతో ఆ దారి గుండా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై మురుగు నీరు నిలిచిపోవడంతో దోమలు వ్యాప్తి చెంది దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. హిమాయత్ నగర్ ప్రధాన రహదారి పక్క ఉన్న మసీద్ నమాజ్‌కు వెళ్లే ముస్లింలు సైతం మురుగు నీటిలో నుంచే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. హిమాయత్ నగర్ డివిజన్ లోని చాలా ప్రాంతాల్లో పురాతన పైపులైన్లు ఉండటంతో పాటు పెరిగిన జనాభాకు అను గుణంగా పైపులైన్లను ఆధునీకరించకపోవడంతో నిత్యం మురుగునీటి లీకేజీలు కొనసాగుతున్నాయి.

హిమాయత్‌నగర్‌లో..రహదారి పక్కన

నిధులు రాగానే పనులు చేపడుతాం

ఈ విషయంపై నారాయణగూడ జలమండలి జీఎం రామకృష్ణ వివరణ కోరగా మురుగునీరు పొంగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. నిధుల కోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేసి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

– రామకృష్ణ, నారాయణగూడ జలమండలి జీఎం

నిర్వీర్యం అవుతున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ లో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 27: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ నిరుద్యోగ సమస్యను మరింత పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ధర్మేంద్ర, నగర కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ ఆరోపించారు. చంద్రశేఖర్ ఆజాద్ 94వ వర్ధంతి సందర్భంగా గురువారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్ లో ఆజాద్ చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బ్రిటిష్ ముష్కరుల బానిస సంకెళ్ల నుండి దేశ విముక్తి కోసం పోరాడిన యోధుడు ఆజాద్ అని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న యువ జన వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని యువత పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్యప్రసాద్, నేతలు షేక్ మహమూద్,కల్యాణ్, అనిల్ కుమార్, వంశీ, బాలు,విజయ్, అరుణ్,లక్ష్మణ్, శరత్, ఏఐటీ యూసీ నేత చెట్టు కింది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈడీ జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేసి తమ వెబ్సైట్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్ కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 24వ తేదీలోగా తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్లో చూసుకోవాలని సూచించారు.

పీఅండ్ టీ కాలనీలో సమస్యలు పరిష్కరించండి

కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న పీ అండ్ టీ కాలనీవాసులు

బండ్లగూడ, ఫిబ్రవరి 27.. పీ అండ్ టీ కాలనీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రను పీఅండ్ టీ కాలనీవాసులు కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ.. తమ కాలనీలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రాత్రి వేళలో రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు జరుగుతున్నారన్నారు. వెంటనే తమ కాలనీలో విద్యుత్ దీపాలతో పాటు ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సాయంత్రం వేళలో దోమల బెడద తీవ్రంగా ఉందని దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు నదీమ్, అబ్దుల్ ఆఫీస్, ఎండీ షఫీ, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో వసతులు కల్పించాలి

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రం పరిశీలనలో కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ విజ్ఞాన్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ, ఫిబ్రవరి 27: ఇంటర్మీడియట్ పరీక్షలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని కమిషనర్ శరత్‌చంద్ర కళాశాల యజమానులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చే నెల 5 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పరీక్షా కేంద్రమైన విజ్ఞాన్ కళాశాలలో చైర్మన్ గౌరీ సతీష్‌తో కలిసి గురువారం కమిషనర్ శరత్‌చంద్ర పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయా కళాశాలలో వసతుల ఏర్పాట్ల గురించి కళాశాల యజమానులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పరీక్షా సమయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా కళాశాల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు.

అమావాస్య సందర్భంగా అన్నదానం

మణికొండ, ఫిబ్రవరి 27: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభకు అనుబంధంగా గురువారం అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని మణికొండలో పెద్ద ఎత్తున నిర్వహించారు. మణికొండ మాజీ వార్డు సభ్యురాలు సముద్రాల వాణి రమేష్ ఆధ్వర్యంలో అమావాస్య రోజున అన్న ప్రసాద వితరణ సేవ మణికొండ క్వార్టర్స్ పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో పేదలకు అన్నదానం చేశారు.శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కందాడ రాఘవ రెడ్డి, దొడ్డి లక్ష్మణ్, సుధాకర్ రెడ్డి, శేఖరం పాల్గొన్నారు.

గగన్‌పహాడ్ హజ్రాత్ బాబా దర్గాలో ..

ప్రతి ఒక్కరూ దైవచింతనతో ముందుకు సాగినప్పుడే మనశాంతిగా ఉంటారని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గగన్‌పహాడ్‌లోని దర్గా హజ్రాత్ బాబా దర్గాలో ఉర్సు ఉత్సవాల సందర్భంగా దర్గాను సందర్శించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చదర్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సరికొండ వెంకటేష్, దివ్యాంగుల సమాఖ్య ప్రతినిధి మహబూబ్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

– మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 27

మట్టికుప్పల తొలగింపు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 27: ప్రజల సమస్యల పరిష్కరించడంలో ముందుండే ప్రజాప్రతినిధి ఎమ్మెల్యే ముఠా గోపాల్ అని బిఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్ అన్నారు. రాంనగర్ డివిజన్లోని నెహ్రూ నగర్ –ఏ బస్తీ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్, పార్టీ యువ నాయకుడు ముఠా జై సింహా ను ఇటీవలే ఆ బస్తీ వాసులు కలిశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్, జై సింహా లు జిహెచ్ఎంసి అధికారంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గురువారం జిహెచ్ఎంసి సిబ్బంది మట్టి కుప్పలను తొలగించారు. ఈ సందర్భంగా శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముందుంటారని అన్నారు. అదేవిధంగా ముఠా జై సింహ కూడా ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తారని అన్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు వస్తివాసులు ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కళ్యాణ్ నాయక్ ,ప్రేమ్ కుమార్ ముదిరాజ్, రాజు, సందీప్ ,చైతన్య ప్రవీణ్ , నెహ్రూ నగర్ బస్తివాసులు పాల్గొన్నారు.

మట్టి తొలగింపు పనులను పరివేక్షిస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శంకర్

కబ్జా చేస్తున్నా..అడ్డుకోరా..!

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరి,మండల కార్యదర్శి నర్రగిరి

శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరి, మండల కార్యదర్శి నర్ర గిరి

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 27 : చెరువులు, కుంటలను కాపాడడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరి, మండల కార్యదర్శి నర్ర గిరిలు పేర్కొన్నారు.గురువారం శంషాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శంషాబాద్ మున్సిపాలిటీలో చెరువులను అక్రమార్కులు కబ్జాలు చేస్తున్నారని ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకుపోయామన్నారు. కాని అధికారులు మాత్రం కబ్జాలను అడ్డుకోవడం లేదన్నారు. శంషాబాద్ పట్టణంలోని కాముని చెరువుతో పాటు ఫిరంగినాలా, తీగల కుంటలను కబ్జా చేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని వివరించారు. శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాలలో సైతం చెరువులు కుంటలను కబ్జా చేస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిచో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. దీం తో పాటు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఇలా సీజ్..అలా బకాయి చెల్లింపు

యూసుఫ్‌గూడలో కార్ఖానా సీజ్ చేసిన అధికారులు.. వెంటనే పాత బకాయి రూ. 10 లక్షలు చెల్లించిన యజమాని..

జీహెచ్ఎంసీ అధికారులకు రూ.10 లక్షల ఆస్తిపన్ను చెక్కును అందజేస్తున్న యజమానులు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 27: ఆస్తిపన్ను వసూలును అధికారులు వేగవంతం చేస్తున్నారు. ఈ ఏడాది చెల్లింపులకు మార్చి 31 తో గడువు ముగియనుండడంతో జీహెచ్ఎంసీ అధికారులు ప్రాపర్టీ ట్యాక్స్ వసూలులో వేగం పెంచారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో నెల రోజులే సమయం ఉండడంతో నిర్దేశిత లక్ష్యాన్ని చేరేందుకు దూకుడు పెంచారు. గురువారం యూసుఫ్‌గూడ సర్కిల్ ఎర్రగడ్డలో రూ.10 లక్షలకు పైగా ప్రాపర్టీ ట్యాక్స్ బకాయి వున్న ఓ కార్ఖానాను ఏఎంసీలు కమల్, బాలరాజ్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. జీహెచ్ఎంసీ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ ఇబ్రహీం, బిల్ కలెక్టర్ షేక్ మొయిన్ సంబంధిత సంస్థకు తాళం వేశారు.దీంతో యజమాని దిగివచ్చి పాత బకాయితో పాటు ఈ ఏడాదికి సంబంధించిన ప్రాపర్టీ ట్యాక్స్ మొత్తం చెల్లించినట్లు అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ లోని యూసుఫ్‌గూడ, రహ్మత్ నగర్, వెంగళరావు నగర్, బోరబండ, ఎర్రగడ్డ వార్డులలో 9 డాకెట్స్ గా ఆస్తి పన్ను వసూలు ను ముమ్మరం చేస్తున్నారు.గడువు లోపు బకాయిలు చెల్లించని వారి ఆస్తులు జప్తు చేస్తామని డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా హెచ్చరించారు. ఆస్తిపన్ను సకాలంలో చెల్లించి అపరాధ రుసుం నుంచి మినహాయింపు పొందాలని కోరారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 27: టీఎస్ ఎస్ పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కెవి బౌద్ధ నగర్, జామై ఉస్మానియా ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనునట్లు అజాంబాద్ డివిజన్ ఏడీఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బౌద్ధనగర్ ఫీడర్ పరిధిలోని బౌద్ధనగర్, కౌసర్ మసీద్, వారాసిగూడ, ఆర్ట్స్ కాలేజీ, బాలాజీ కమ్యూనిటీ హాల్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12:30 నుంచి 2గంటల వరకు జామై ఉస్మానియా ఫీడర్ పరిధిలోని జమై ఉస్మానియా, ఎస్ బీహెచ్ కాలనీ, లలితనగర్, అంబర్ నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

అమీర్ పేట్, ఫిబ్రవరి 27: సనత్ నగర్ డివిజన్ లో రూ.78 లక్షల వ్యయంతో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. జెక్ కాలనీలో రూ.58 లక్షలు, సనత్ నగర్ బస్ టెర్మినల్ సమీపంలోని ఫరాష హోటల్ నుంచి ఫ్లై ఓవర్ కింది వరకు రూ.19.80 లక్షలతో చేపట్టనున్న రోడ్ల నిర్మాణ పనులకు ఆయా కాలనీలకు చెందిన ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సనత్ నగర్ డివిజన్ లో గత దశాబ్ద కాలంలో వందల కోట్ల నిధులు వెచ్చించి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. గత బీఆర్ ఎస్ హయాంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేయూత వల్లే డివిజన్ అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెక్ కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డీఆర్ఎస్ చందుతోపాటు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలను బాల్ రెడ్డి, నాయకులు పురుమాని మల్లారెడ్డి, ఖలీల్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు 15 శాతం నిధులను కేటాయించాలి

సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రతినిధులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 27: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు 15శాతం నిధులు కేటాయించాలని తల్లుల సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే కేటాయించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్ రామ్ భవనంలో గురువారం ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వాలు సరిపడా నిధులు కేటాయించకపోవడం వల్ల విద్యారంగం చిన్నాభిన్నంగా తయారైందని అన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన సరిగా లేక విద్యాప్రమాణాలు దిగజారుతున్నాయని తెలిపారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు.

భవిష్యత్ అంతా.. సాగు రంగానిదే..!

వీసీల సన్మాన సభలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



ప్రొఫెసర్లు, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సనానిస్తున్న అధ్యాపకులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి, 27: రానున్న కాలంలో వ్యవసాయ ,అనుబంధ రంగాలకే తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వనుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన వీసీల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.తెలంగాణ వ్యవసాయ,అనుబంధ రంగాలైన పశుపోషణ,పంటలు,కూరగాయల పెంపకంలో దేశవ్యాప్తంగా మంచిపేరు వస్తుందన్నారు. సమష్టిగా పనిచేసి మరిన్ని మంచి ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రధానంగా ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా డా.అల్ధాస్ జానయ్య, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన యూనివర్సిటీ ఉపకులపతిగా రాజిరెడ్డి, పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతిగా డా.జ్ఞాన ప్రకాశ్ లను నియమించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఆయా రంగాల అభివృద్ధికి మరింత కృషిచేయాలని ఆయన సూచించారు.అనంతరం వారిని ఉద్యోగులు ,విద్యార్థుల సమక్షంలో సన్మానించారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ విద్యాసాగర్, శరత్ చంద్ర, డా.భగవాన్,డీన్ నరేందర్ రెడ్డి,ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కనుల పండుగగా శివపార్వతుల కళ్యాణం

అత్తాపూర్ చిన్న అనంతగిరి శివాలయానికి పోటెత్తిన భక్తులు

శివపార్వతుల కళ్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

మైలార్‌దేవ్‌పల్లి/మణికొండ , ఫిబ్రవరి 27: శంభో శివశంకర నామస్మరణతో అత్తాపూర్ పరిసరాలు మార్మోగాయి. చారిత్రాత్మకమైన అత్తాపూర్ డివిజన్ రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలో 50వ మహాశివరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అర్ధరాత్రి 12.30 గంటలకు శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. మూడో రోజు తెల్లవారుజామున శివ సుప్రభాతం, అభిషేకం, పూజా కార్యక్రమాలు, సర్పదర్శనం తదితర పూజలు నిర్వహించారు. ఉమామహేశ్వరి స్వామి వార్లకు పుష్పాలంకార భూషణం సందర్భంగా దేవాలయ పరిసరాలు వివిధ రకాల పూలతో అందంగా ముస్తాబు చేశారు. సాయంత్రం అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

చిన్న అనంతగిరి శివాలయంలో వివిధ రకాల పూలతో ముస్తాబు చేసిన దృశ్యాలు.

మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న ప్రణవ భక్త సమాజం సభ్యులు

మంచిరేవులలో కొనసాగుతున్న వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు

నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల గ్రామంలో చారిత్రాత్మక వీరభద్ర స్వామి మచలేశ్వర దేవాలయ బ్రహ్మోత్సవాలు శివరాత్రి పండగ సందర్భంగా ప్రత్యేక నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో భాగంగా గురువారం బ్రహ్మోత్సవాలు రెండవ రోజు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. రెండవ రోజు జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవం అనంతరం గ్రామంలో స్వామివారి రథోత్సవాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు మాజీ గ్రామ సర్పంచ్ ప్రవీణ్ యాదవ్ , మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ,నాయకులు దశరథ్ యాదవ్, పొన్న రమేష్, లక్ష్మణ్, భాస్కర్, సతీష్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న అనంతగిరి శివాలయంలో దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బంజారాహిల్స్,ఫిబ్రవరి 27: ట్రాఫిక్ సిగ్నల్ వద్ద నిలబడిన వాహనాన్ని ర్యాష్ డ్రైవింగ్‌తో వచ్చిన కారు ఢీకొట్టడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆనంద్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న వి.నాగరాజు(27) అనే యువకుడు ప్రైవేటు సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేస్తుంటాడు. ఈనెల 24న బంజారాహిల్స్ మీదుగా శ్రీనగర్ కాలనీ వైపునకు బైక్ మీద వెళ్తుండగా సిగ్నల్ వద్ద ఆగాడు. అదే సమయంలో ఎడమవైపునుంచి వేగంగా వచ్చిన కారు నాగరాజు బైక్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆస్పత్రిలో చేర్చగా మెడ ఎముక విరిగినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. ఈమేరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజు గురువారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యోత్సవాలు

బేగంపేట: ప్రకాశ్‌నగర్ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి మహోత్యవాలు అత్యంత వైభవంగా జరిగినవి.ఈ సందర్భంగా శ్రీ దత్త కూచిపూడి నాట్య కళాక్షేత్రం వారి నాట్య ప్రదర్శనలు వారి గురువు నంది అవార్డు గ్రహీత, గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత, నాట్య మయూరి బిరుదాంకితురాలు కుమారి పావని మఠం ఆధ్వర్యంలో జరిగిన నృ త్య ప్రదర్శనలకు అధిక సంఖ్యలో భక్తు లు, చిన్నారుల తల్లి తండ్రులు తరలి వచ్చి తిలకించారు.. ముఖ్య అతిథులుగా విచ్చేసిన గద్వాల్ అడిషనల్ ఎస్పీ శ్రీ సాంబయ్య, బేగంపేట సిఐ శ్రీ రామయ్య, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శ్రీ మధుకర్, ఎస్ ఐ వరలక్ష్మి, శ్రీనివాస్ ,భూ లక్ష్మి అమ్మవారి ఆలయ నిర్మాణదాత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ విశాల్ సూదం గారు, ఆలయ ప్రధాన అర్చకులు మఠంసదాశివం గారు పాల్గొని చిన్నారులకు బహుమతులు అందజేశారు.

సనత్ నగర్ లో ఉచిత కంటి వైద్య శిబిరం

అమీర్పేట్ ఫిబ్రవరి 27: లయన్స్ క్లబ్ ఆఫ్ సనత్ నగర్, సంకేత్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 1న సనత్ నగర్ లోని వెజిటేబుల్ మార్కెట్ గ్రౌండ్స్ లో ఉచిత కంటి వైద్య శిబిరం జరగనుంది. ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు, సరోజినీ దేవి కంటి ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.